సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 23 । ఏప్రిల్ । 2023

న్యూస్‌రీల్

ఉత్తమ పంచాయతీగా భీమవరం

సాక్షి, పాడేరు: రాష్ట్రస్థాయిలో ఉత్తమ పంచాయతీగా హుకుంపేట మండలం భీమవరం ఎంపికయింది. శనివారం 9 విభాగాలలో పురస్కారాలు ప్రకటించగా అందులో జిల్లా నుంచి ఆరోగ్య పంచాయతీగా భీమవరానికి స్థానం లభించింది. ఈ నెల 24న జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా విజయవాడలో జరిగే కార్యక్రమంలో సర్పంచ్ పురస్కారం అందుకోనున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కూడా పాల్గొనాలని సూచించారు. అదే రోజు జిల్లా స్థాయి, మండల స్థాయిలో కూడా 9 విభాగాలలో పురస్కారాలు అందించనున్నారు.

110 యూనిట్ల రక్తం సేకరణ



పాల్గొన్న రక్తదాతలు

సాక్షి,పాడేరు: స్థానిక మోదమాంబ పాఠశాలలో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైంది.మోదమాంబ పాఠశాల వ్యవస్థాపకుడు గొల్లపల్లి మూర్తి ద్వితీయ వర్ధంతి పురస్కరించుకుని అతని భార్య, ప్రిన్సిపల్ నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ట్రైనీ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ ప్రారంభించారు. రెడ్‌క్రాస్ సొసైటీ వైద్యబృందం పర్యవేక్షణలో 110 మంది నుంచి 110 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఆదివాసీ జేఏసీ నేతలు రామారావుదొర, గంగరాజు, వర్తక సంఘం ప్రతినిధులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి మోదమ్మ ఉత్సవాలు

● చింతలవీధిలో ఏర్పాట్లు పూర్తి



విద్యుత్ అలంకరణ



అమ్మవారి విగ్రహం

సాక్షి, పాడేరు: చింతలవీధిలో ఆదివారం మోదకొండమ్మతల్లి జాతరను ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ, గ్రామ పెద్దలు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఉత్సవాలు ఈనెల 25 వరకు మూడు రోజులపాటు జరగనున్నాయి. పాడేరు నుంచి చింతలవీధి రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ దీపాలతో అలంకరించారు. చింతలవీధి జంక్షన్‌లో అమ్మవారి సతకం పట్టు మందిరాన్ని నిర్మించారు.ఆదివారం ఉదయం 8గంటలకు అమ్మవారి ఉత్సవ విగ్రహం,పాదాలు, ఘటాలను ఆలయం నుంచి సతకంపట్టు వరకు ఊరిగిస్తారు. అనంతరం సతకంపట్టులో వాటిని కొలువుదీర్చి ఉత్సవాలు ప్రారంభిస్తారు.

నేడు ఉత్సవ పోస్టర్ల ఆవిష్కరణ

సాక్షి, పాడేరు: వచ్చేనెల 14 నుంచి 16 వరకు పాడేరులో జరిగే మోదకొండమ్మతల్లి ఉత్సవాలకు సంబంధించిన ప్రచార పోస్టర్లను ఆదివారం ఉదయం ఆవిష్కరిస్తున్నామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వర్తన పిన్నయ్యదొర తెలిపారు. ఆలయ కమిటీ చైర్‌పర్సన్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పోస్టర్లను ఆవిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు. అన్నివర్గాల భక్తులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులు ఉదయం 9.30కు అమ్మవారి ఆలయానికి విచ్చేయాలని ఆయన కోరారు.

పోలీసువనంలో గంజాయి మొక్క



- గంజాయి తరలింపునకు మోతుగూడెం ఎస్‌ఐ సత్తిబాబు సహకారం
- స్మగ్లర్ల ప్రలోభాలకు గురై గ్రీన్ సిగ్నల్
- కేసు నమోదు చేసిన ఉన్నతాధికారులు
- ఇంకెవరిదైనా ప్రమేయముందా అనే కోణంలో లోతుగా దర్యాప్తు



పట్టుకున్న గంజాయి నిందితులతో మోతుగూడెం ఎస్‌ఐ సత్తిబాబు (సర్కిల్‌లో వ్యక్తి) పాత చిత్రం

చింతూరు/మోతుగూడెం: గంజాయి తరలింపు వ్యవహారంలో మోతుగూడెం ఎస్‌ఐ సత్తిబాబుపై కేసు నమోదు కావడం తీవ్ర సంచలనం రేకెత్తించింది. గంజాయి సాగు, రవాణాను అరికట్టేందుకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతున్నా పోలీసు శాఖలో కొంతమంది ప్రలోభాలకు గురై స్మగ్లర్లకు సహకరించడం విస్మయానికి గురిచేస్తోంది. ఇప్పటివరకు గంజాయి తరలించిన వారిపై దృష్టి సారించిన పోలీసు ఉన్నతాధికారులు ఇప్పుడు మరో కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. ఎస్‌ఐ పాత్ర బహిర్గతం కావడంతో ఈ వ్యవహారంతో తమ శాఖలో ఇంకెవరి ప్రమేయముందా అనే కోణంలో లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

విస్తరిస్తున్న నేర సామ్రాజ్యం

ఆంధ్రా–ఒడిశా రాష్ట్రాల సరిహద్దుల్లో పండిస్తున్న గంజాయిని పోలీసు ఉన్నతాధికారులు దగ్గరుండి ధ్వంసం చేయిస్తున్నా కొంతమంది పోలీసుల వైఖరి కారణంగా ఆ శాఖకు చెడ్డపేరు వస్తోంది. మరోవైపు గంజాయి స్మగ్లర్లు తమ కార్యకలాపాలకు అడుకట్ట పడకుండా ఇతర మార్గాలను అన్వేషిస్తున్నారు. దీనిలో భాగంగానే వారు తమ అక్రమ వ్యాపారానికి అడ్డంకిగా మారిన పోలీసులను ప్రలోభాలకు గురి చేసే స్థాయికి తమ నేర సామ్రాజ్యాన్ని విస్తరించారు.

మల్కన్‌గిరి కేంద్రంగా..

ఒడిశాలోని మల్కనగిరి జిల్లా కేంద్రంగా స్మగ్లర్లు గంజాయిని విరివిగా పండిస్తున్నారు. ఆంధ్రా సరిహద్దులకు సమీపంలోని కుర్మనూరు, నిమ్మనూరు, రాశిబేడ, గిల్లమడుగు, సన్యాసిగూడ వంటి అటవీ ప్రాంతాల్లో అమాయక ఆదివాసీలను ప్రలోభపెట్టి గంజాయిని పండిస్తున్నారు. వివిధ సైజుల్లో ప్యాకింగ్ చేసిన ఎండు గంజాయిని ఆంధ్రా సరిహద్దులకు తరలిస్తున్నారు.

● ప్రధానంగా ఒడిశాలో పండిస్తున్న గంజాయిని స్మగ్లర్లు ఆంధ్రా, ఒడిశా సరిహద్దుల్లో గల జిల్లాలోని మోతుగూడెం, డొంకరాయి, సీలేరు పోలీసు స్టేషన్ల మీదుగానే రవాణా చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయా పోలీసుస్టేషన్ల పరిధిలో గత రెండేళ్లలో సుమారు 35 వేల కిలోల గంజాయి పట్టుబడింది.

రూ.లక్షలు ఎర చూపడంతో..

గంజాయి స్మగర్ల ప్రలోభాలకు లొంగుతున్న కొందరు పోలీసులు తప్పటడుగులు వేస్తూ పోలీసుశాఖకు మచ్చ తెస్తున్నారు. గంజాయి స్మగ్లర్లు రూ.లక్షల్లో ఇచ్చే సొమ్ములకు ఆశపడి గంజాయి రవాణాకు సహకరిస్తుండడంతో గంజాయి అక్రమ రవాణా సాగుతోంది.

గతంలోనూ ఆరోపణలు..

గంజాయి స్మగ్లర్లకు సహకరించిన వ్యవహారంలో ఆరోపణలు రావడంతో గతంలో డొంకరాయి పోలీసు స్టేషన్‌కు చెందిన ఓ ఎస్‌ఐ ఆత్మహత్యకు పాల్పడ్డారు. మోతుగూడెం పోలీసుస్టేషన్‌కు చెందిన ముగ్గురు ఎస్‌ఐలు, సిబ్బందిపై కూడా ఆరోపణలు వచ్చాయి.

● తాజాగా నెల్లూరులో గంజాయి తరలిస్తున్న కారు పట్టుబడిన వ్యవహారంలో రూ 2.50 లక్షలు చేతులు మారినట్టుగా తెలుస్తోంది. స్మగ్లర్లు ఆ సొమ్ములను నేరుగా పోలీసులకు కాకుండా వారికి సహకరించే బయట వ్యక్తుల ఖాతాల్లో జమ చేసినట్లుగా సమాచారం. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న మోతుగూడెం ఎస్‌ఐపై కేసునమోదైంది.

చర్యలకు రంగం సిద్ధం

గంజాయి తరలింపుపై లోతుగా విచారణ చేపట్టిన పోలీసు ఉన్నతాధికారులు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న తమ శాఖకు చెందిన సిబ్బందితో పాటు ప్రైవేటు వ్యక్తులపై చర్యలకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ వ్యవహారంలో ప్రమేయమున్న ఎస్‌ఐ ఇప్పటికే పరారీలో వుండగా అతని ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు ముమ్మరం చేశారు.

రెండు రోజులుగా విచారణ

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చింతూరు ఏఎస్పీ మహేశ్వరరెడ్డి గత రెండురోజులుగా మోతుగూడెం పోలీస్‌స్టేషన్ వ్యవహారంలో ప్రమేయమున్న సిబ్బందితో పాటు ప్రైవేటు వ్యక్తులను విచారిస్తున్నారు. స్మగ్లర్లకు ఎప్పటినుంచి ఎలా సహకరిస్తున్నారు.. ఎంత సొమ్ములు చేతులు మారాయి.. ఎవరెవరికి ఎంత ముట్టాయి.. ఎన్ని వాహనాల్లో ఎంత తరలివెళ్లింది అనే కోణాల్లో లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

కూల్ కూల్!

- భానుడి భగభగల నుంచి ఉపశమనం
- గణనీయంగా తగ్గుతున్న ఉష్ణోగ్రతలు
- వడగాడ్పులకు కొన్నాళ్లు విరామం
- మూడు రోజులు అకాల వర్షాలు, ఈదురుగాలులు
- ద్రోణి, గాలుల ప్రభావంతో మారిన వాతావరణం



పాడేరు ప్రధాన రోడ్డులో కురుస్తున్న వర్షం

సాక్షి, విశాఖపట్నం: దాదాపు మూడు వారాల నుంచి భానుడు భగభగలాడుతున్నాడు. అత్యధిక ఉష్ణోగ్రతలతో జనాన్ని అల్లాడిస్తున్నాడు. మే నెలలో చవిచూసే ఉష్ణతాపాన్ని ఏప్రిల్ ఆరంభం నుంచే వెదజల్లుతున్నాడు. సాధారణంకంటే గరిష్టంగా ఏడు డిగ్రీల వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో వాతావరణంలో ఒక్కసారిగా మార్పు చోటు చోటుచేసుకోవడంతో ఉష్ణోగ్రతలు అనూహ్యంగా తగ్గుముఖం పట్టాయి. శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల (40 డిగ్రీలు నమోదు) మినహా మిగతా ప్రాంతాల్లో 38 డిగ్రీలలోపే ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. దీంతో ఉష్ణతాపం నుంచి ఉపశమనం లభించినట్టయింది.

ఉపరితల ఆవర్తనంతో..

ప్రస్తుతం వాయువ్య మధ్యప్రదేశ్ నుంచి దక్షిణ తమిళనాడు వరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. మరోవైపు దక్షిణ, నైరుతి దిశల నుంచి గాలులు వీస్తున్నాయి. ఫలితంగా పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుముఖం పడుతున్నాయి. అదే సమయంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులకు కారణమవుతున్నాయి. రానున్న మూడు రోజులు ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇదే పరిస్థితి కొనసాగనుంది. గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. అదే సమయంలో పిడుగులకు ఆస్కారం ఉందని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

వేసవి దుక్కులకు మేలు..

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో శనివారం మధ్యాహ్నం నుంచి వాతావరణం చల్లబడింది.సాయంత్రం కుండపోతగా భారీ వర్షం కురవడంతో జనజీవనానికి కాస్త అంతరాయం ఏర్పడింది.పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల మండలాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి ప్రజలు భయాందోళనలు చెందారు. పాడేరుతో పాటు ఘాట్‌లోను వర్షం కురిసింది. వేసవి దుక్కులకు ఈ వర్షాలు మేలు చేస్తాయని వ్యవసాయాధికారులు పేర్కొన్నారు.

జి.మాడుగులలో కుండపోత

జి.మాడుగుల: పలు గ్రామాల్లో శనివారం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. దీంతో వీధులు, రోడ్లు జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పిడుగులు పడటంతో ఈ ప్రాంత ప్రజలు భయాందోళనలు చెందారు. పాడేరు–జి.మాడుగుల, చింతపల్లి రోడ్డు మార్గంలో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.



జి.మాడుగులలో కురుస్తున్న వర్షం

● భక్తిశ్రద్ధలతో రంజాన్



చింతూరు మసీదులో ఈద్ ముబారక్ చెప్పుకుంటున్న ముస్లిం సోదరులు

II లో


ముస్లిం సోదరులు రంజాన్ పండగను శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మతగురువులు సందేశాన్ని వినిపించారు. మసీదులు వద్ద ప్రత్యేక ప్రార్థనలతోపాటు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. హిందువులకు విందు ఏర్పాటుచేసి మతసామరస్యాన్ని చాటిచెప్పారు.



పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మికి స్వీట్లు అందజేస్తున్న ముస్లిం సోదరులు

చందన సేవకు వేళాయె

- నేడే సింహాద్రి అప్పన్న చందనోత్సవం
- ఉదయం 4 గంటల నుంచి సర్వదర్శనం
- శోభాయమానంగా సింహగిరి



విద్యుత్ దీప కాంతుల్లో సింహగిరి

సింహాచలం: దుష్టసంహారానికి ఉగ్రరూపధారియైన నృసింహుడు భక్తుల అభీష్టం నెరవేర్చేందుకు అనేక చోట్ల స్వయంభువుగా వెలిశాడు. అలాంటి ప్రసిద్ధ క్షేత్రాలలో సింహగిరి ఒకటి. తూర్పు కనుమలలో ప్రకృతి సౌందర్యం నడుమ సింహాద్రిపై పశ్చిమాభిముఖుడైన శ్రీ వరాహ లక్ష్మీనృసింహుడు అశేష భక్తకోటికి ఇష్టదైవం. వైశాఖ శుద్ధ తదియ నాడు భక్తజన కోటికి నిజరూప దర్శనం అనుగ్రహిస్తాడు. చందన యాత్ర నాడు నిజరూపం దర్శనం వైకుంఠంలో లక్ష్మీనారాయణులను దర్శించినంత ఫలితమని క్షేత్ర మహాత్మ్యం పేర్కొంటోంది.

ఆదివారం జరగనున్న చందనోత్సవానికి అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. తెల్లవారుజామున ఒంటి గంట నుంచి ఆలయ అర్చకులు వైదిక కార్యక్రమాలు ప్రారంభిస్తారు. స్వామివారిపై ఉన్న చందనాన్ని శాస్త్రోక్తంగా ఒలిచి నిజరూప భరితున్ని చేస్తారు. అనంతరం దేవస్థానం వంశపార ధర్మకర్త పుసపాటి అశోక్‌గజపతిరాజుకి తొలిదర్శనం కల్పిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామివారికి దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పట్టువస్త్రాలు సమర్పిస్తారు. టీటీడీ తరపున సంప్రదాయ వస్త్రసమర్పణ ఉంటుంది. ఉదయం 4 గంటల నుంచి సర్వదర్శనం భక్తులకు అందజేస్తారు. రాత్రి 7 గంటల వరకే భక్తులను క్యూల్లోకి అనుమతిస్తారు. తరువాత క్యూల ప్రవేశ ద్వారాలు మూసివేసి అప్పటి వరకు క్యూల్లో ఉన్న భక్తులకు స్వామివారి దర్శనాన్ని కల్పిస్తారు. రాత్రి 8.30 గంటల నుంచి పాంచరాత్ర ఆగమశాస్త్ర పండితులు త్రిదండి చినజీయర్‌స్వామి పర్యవేక్షణలో స్వామికి సహస్రఘటాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. సింహగిరిపై ఉన్న గంగధార వద్ద నుంచి శ్రీవైష్ణవ స్వాములు కలశాలతో నీటిని తీసుకురాగా స్వామికి అభిషేకం చేస్తారు. పంచామృతాభిషేకాలు నిర్వహిస్తారు. తదుపరి విశేష పూజలు నిర్వహించిన అనంతరం స్వామికి తొలివిడతగా మూడు మణుగుల చందనాన్ని సమర్పిస్తారు.

పకడ్బందీ ఏర్పాట్లు

ఈసారి 1.50 లక్షల మంది భక్తులు వస్తారని జిల్లా యంత్రాంగం అంచనా వేసింది. సర్వదర్శనంతో పాటు రూ.300, రూ.1000 దర్శనం టికెట్లు, రూ.1500 వీవీఐపీల టికెట్లు అందుబాటులో ఉంచారు. తొలిసారిగా రూ.300, రూ.1000 టికెట్లు ఆన్‌లైన్‌లో విక్రయాలు జరిపారు. కాగా రూ.300 దర్శనం టికెట్లపై వేచ్చేవారికి కూడా వివిధ స్లాట్‌ల్లో దర్శన సమయాన్ని కేటాయించారు. కలెక్టర్ మల్లికార్జున, దేవస్థానం ఈవో త్రినాథరావు, జీవీఎంసీ, ఫైర్, ఆర్టీసీ, మెడికల్ అండ్ హెల్త్, పోలీస్, ఫైర్, రెవెన్యూ తదితర శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేశారు. కాగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ త్రివిక్రమ్ వర్మ ఆధ్వర్యంలో పన్నెండు వందలకి పైగా పోలీసులు చందనోత్సవం బందోబస్తు నిర్వహించనున్నారు. చందనోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలోని ప్రహ్లాదమండపాన్ని విశేషంగా పూలతో అలంకరించారు.





స్వామివారి నిజరూపం, సహస్ర ఘటాభిషేకానికి కలశాలను సిద్ధం చేస్తున్న అర్చకులు

చందనంలో సుగంధ ద్రవ్యాల మేళవింపు



చందనంలో సుగంధ ద్రవ్యాలను కలుపుతున్న అర్చకులు

చందనోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సమర్పించే మూడు మణుగుల పచ్చిచందనంలో శనివారం దేవస్థానం అర్చకులు పలు రకాల సుగంధ ద్రవ్యాలను కలిపారు. ఈ చందనాన్ని ఆదివారం రాత్రి సహస్ర ఘటాభిషేకం అనంతరం స్వామికి సమర్పించనున్నారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మన్యంలో పర్యాటకుల జోష్



దముకు వ్యూపాయింట్ వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు



బొర్రాగుహల అందాలను తిలకిస్తున్న పర్యాటకులు

మొదలైన సందడి

అనంతగిరి: సందర్శిత ప్రాంతాలు పర్యాటకులతో కళకళలాడుతున్నాయి. శీతాకాలం తరువాత పర్యాటకుల తాకిడి తగ్గింది. టెన్త్, ఇంటర్ పరీక్షలు పూర్తి కావడంతో ఇప్పుడు పర్యాటకుల రాక మొదలైంది. మన్యం అందాలను తిలకించేందుకు కుటుంబసమేతంగా తరలివస్తున్నారు.

బొర్రా గుహలకు తాకిడి : ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు వారం రోజులుగా పర్యాటకులు తాకిడి పెరుగుతోంది. గత ఆదివారం 1255 మంది, సోమవారం 505, మంగళవారం 476, బుధవారం 545, గురువారం 395, శుక్రవారం 638, శనివారం 1386 మంది గుహలను సందర్శించారు. కటికి, సరియా, తాటిగుడ, చిట్టంపాడు జలపాతాలు, కాఫీ ప్లాంటేషన్ల వద్ద పర్యాటకుల సందడి నెలకొంది.

భక్తిశ్రద్ధలతో రంజాన్



అరకులోయలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



చింతపల్లి మసీదులో..



జోలాపుట్టులో..

సాక్షి,పాడేరు: ముస్లిం సోదరులు రంజాన్ పండగను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మతగురువులు సందేశాన్ని వినిపించారు. మసీదులు వద్ద ప్రత్యేక ప్రార్థనలతోపాటు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక పురాతన మసీదు పరిధిలోని ముస్లింలంతా శాంతి ర్యాలీ నిర్వహించారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక జమాత్ మసీదులోను రంజాన్ ప్రార్థనలు జరిగాయి. కులమతాలకు అతీతంగా విందు భోజనాలు ఏర్పాటుచేశారు.

చింతూరు: రంజాన్ (ఈద్‌ఉల్‌ఫితర్) పండుగను ముస్లిం సోదరులు శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముస్లింలు కొత్త దుస్తులు ధరించారు. ఈద్గా, మసీదుల్లో మత గురువులు రెండు రకాతుల నమాజును ఆచరించిన అనంతరం ఖురాన్ పఠనం వినిపించారు. నమాజు అనంతరం ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. అనంతరం ఇళ్లకు చేరుకుని సేమియా పాయసాన్ని స్వీకరించారు. చింతూరులోని మస్జిద్ ఎ యాసీన్‌తో పాటు మోతుగూడెం, ఏడుగురాళ్లపల్లి మసీదుల్లో రంజాన్ నమాజును ఆచరించారు. పండుగ సందర్భంగా ముస్లింలకు పలువురు హిందూ సోదరులు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

కొయ్యూరు: రాజేంద్రపాలెం బిలాల్ మసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎస్‌కే పీర్‌వాష్, యాసీన్, నాగూర్, బఖీర్‌ఖాన్ పాల్గొన్నారు.

చింతపల్లి: స్థానిక మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.మతగురువులు, మసీదు పెద్దలు, ముస్లిం సోదరులు భారీగా పాల్గొన్నారు.

కూనవరం: మండల కేంద్రంలో ముస్లిం సోదరులు శనివారం రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాత మసీద్, కొత్త మసీదుల్లో నమాజ్ నిర్వహించిన అనంతరం ప్రముఖులకు, ప్రజాప్రతినిధులకు సేమ్యా పంచి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జా విజయ, ఎంపీటీసీ కొమ్మాని అనంతలక్ష్మి, జేసీఎస్ కన్వీనర్ ఆవుల మరియాదాస్, రాష్ట్ర డైరెక్టర్లు డీ గంగాధర్, ఎ.వెంకటరామారావు, సొసైటీ అధ్యక్షుడు ఎస్.కొండలరావు, ముస్లిం పెద్దలు సుఫీ, మున్నాఫ్, సాయి, లక్ష్మి రహిమ్‌తుల్లా పాల్గొన్నారు.



రాజవొమ్మంగి మసీదులో నమాజు చేస్తున్న ముస్లింలు

ముంచంగిపుట్టు: మండలంలోని జోలాపుట్టులో శనివారం ముస్లిం సోదరులు రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించారు. మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వారికి హిందువులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హిందువులకు ప్రత్యేక విందు ఏర్పాటుచేసి కలిసి భోజనాలు చేశారు.

అరకులోయ రూరల్: స్థానిక మసీదులో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రంజాన్ వేడుకలు నిర్వహించారు. కోఆప్షన్ సభ్యుడు రహింతుల్లా, ఖాన్, రెహ్మాన్, చెల్లయ్య,యాసిన్ పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: స్థానిక రహమానియా మసీదులో భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం సోదరులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మసీద్ గురువు హుస్సేన్ అందరి చేత నమాజు చేయించారు. సేవా కార్యక్రమాలు చేపట్టారు.



అరకులో రంజాన్ వేడుకల్లో ముస్లింలు



కూనవరంలో రంజాన్ వేడుకల్లో ప్రజా ప్రతినిధులు, ముస్లిం పెద్దలు

కన్నేశారు.. తవ్వేస్తున్నారు!

- పట్టపగలే ఇసుక తరలింపు
- చోద్యం చూస్తున్న అధికారులు



అడ్డతీగల-రంపచోడవరం ప్రధాన రహదారిని ఆనుకుని డంపింగ్ చేసిన ఇసుక

అడ్డతీగల: పట్టపగలే ఇసుక అక్రమంగా తరలిపోతోంది. దీనిపై అధికారులు చోద్యం చూస్తుండటంతో ఇసుకాసురులకు కాసుల వర్షం కురిపిస్తోంది. మండలంలోని వేటమామిడి వద్ద పవర్ ప్రాజెక్ట్ సమీపాన కన్నేరు వాగు ప్రవాహం తగ్గిపోవడంతో విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు కొనసాగుతున్నాయి. వర్షాకాలంలో వాగు ప్రవాహం అధికంగా ఉండడం వల్ల ఎగువ ప్రాంతం నుంచి కొట్టుకు వచ్చిన ఇసుక మేటలుగా ఏర్పడింది. ప్రస్తుతం ప్రవాహం తగ్గిపోవడంతో రెండు రోజులుగా పదుల సంఖ్యలో ట్రాక్టర్లపై కూలీలను తీసుకొచ్చి ఇసుకను తవ్వేసి అడ్డతీగల, వై.రామవరం, గంగవరం మండలాలతోపాటు మైదాన ప్రాంతాలకు సైతం తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇక్కడ అధికారికంగా ఇసుక ర్యాంపు నిర్వహణకు ఎటువంటి అనుమతులు లేవు. ఈ నేపథ్యంలో వాగులో ఇసుక సేకరించి ట్రాక్టర్లు, లారీలపై రవాణా చేస్తున్న వారు కొందరైతే, మరికొందరు అడ్డతీగల-రంపచోడవరం ప్రధాన రహదారికి ఆనుకుని డంపింగ్ చేస్తూ ఒక్కో ట్రాక్టర్ లోడ్‌కు అధిక ధరలు నిర్ణయించి విక్రయాలు సాగిస్తున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు గాని ఇటు గ్రామ సచివాలయం సిబ్బంది గాని పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి గండి...

ఇసుక నాణ్యతను గమనించి అధికారికంగా ర్యాంపు నిర్వహణకు అనుమతులిస్తే ప్రభుత్వానికి రాయల్టీగా ఆదాయం సమకూరుతుంది. లేదంటే అక్రమంగా సేకరణ, రవాణా చేస్తున్న అక్రమ రవాణాదారులపై కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేయాల్సి ఉంటుంది. ఈ రెండు పనులకు అధికారులు పూనుకోవడం లేదు. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం అక్రమదారుల జేబుల్లోకి చేరుతోంది.



కన్నేరు వాగులో ఇసుక సేకరించి ట్రాక్టర్లలో నింపుతున్న దృశ్యం

ప్రభుత్వ భవనాలకు, ప్రైవేటు గృహాలకు తరలింపు..

ప్రభుత్వ భవనాలతో పాటు ప్రైవేటు గృహాలకు ఇక్కడి ఇసుకను అధిక ధరకు విక్రయిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుక రూ.2 వేలు నుంచి రూ.3 వేల వరకూ అమ్ముతున్నారు. వేటమామిడి వద్ద నిర్మిస్తున్న ఏకలవ్య స్కూల్ నిర్మాణానికి సైతం ఇదే ఇసుకను సరఫరా చేస్తున్నారు. ఇసుక నాణ్యత ప్రకారం గోదావరి ఇసుకను మాత్రమే ఆయా భవనాలకు వాడాలి. ఈ అంశం ప్రతిపాదిత ఎస్టిమేట్లలోనే స్పష్టంగా పేర్కొన్నారు. కానీ అవేమి పట్టించుకోవడం లేదు. వాగులో ఇసుక సేకరణ, విక్రయాలు, రవాణాపై ఎంపీడీవో కె.బాపన్నదొరని వివరణ కోరగా... ఆ ప్రాంతంలో అధికారికంగా ర్యాంపు నిర్వహణకు అనుమతులు లేవన్నారు. ఇసుక సేకరణ, రవాణాపై పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

గోదావరిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గోదావరిలో లభ్యమైన వృద్ధురాలి మృతదేహం

దేవీపట్నం: మండలంలోని పూడిపల్లి పంచాయతీ పోశమ్మగండి వద్ద గోదావరి నదిలో గుర్తు తెలియని వృద్ధురాలి(65) మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ రంగారావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... పోశమ్మగండి వద్ద గోదావరి నదిలో శనివారం మధ్యాహ్నం ఆమె మృతదేహం కనిపించడంతో స్థానికుల సమాచారం మేరకు దేవీపట్నం పోలీసులు ఒడ్డుకు చేర్చారు. శుక్రవారం సాయంత్రం గండిపోశమ్మ అమ్మవారిని వృద్ధురాలు దర్శించుకుని గోదావరిలో స్నానం చేస్తుండగా మృతి చెంది ఉంటుందని భావిస్తున్నారు. మృతురాలి పూర్తి వివరాలు తెలియరాలేదు. మృతదేహాన్ని రంపచోడవరం ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేడు గురుకులం ప్రవేశ పరీక్ష

జి.మాడుగుల: గిరిజన గురుకుల ప్రతిభా పాఠశాలలు, కళాశాలల్లో 8వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఆదివారం ఉదయం పరీక్ష నిర్వహించనున్నట్టు గురుకులం కళాశాలల కన్వీనర్, ప్రిన్సిపాల్ పారయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అరకు, పాడేరు బాలికల గురుకులం పాఠశాల, కళాశాలల్లో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు హాల్ టికెట్‌తో అరగంట ముందుగానే చేరుకోవాలని సూచించారు.

పిడుగుపాటుకు పశువుల కాపరి మృతి



చెంబునాయుడు మృతదేహం

చింతపల్లి: మండలంలోని పోతురాజు గున్నాల గ్రామానికి చెందిన పశువుల కాపరి వంతల చెంబునాయుడు (48) పిడుగుపాటుకు గురై మరణించాడు. శనివారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఉన్నపళంగా వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఈ క్రమంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఆ సమయంలో పొలాల్లో పశువులను మేపుతున్న చెంబునాయుడుకు సమీపంలో పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.